క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారు

ఓర్వకల్లు : మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భ్రమరాంబ, బుగ్గ రామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సోమవారం ముహూర్తం ఖరారు చేసినట్లు ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ తెలిపారు. ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి సమక్షంలో ఆలయ ప్రధాన అర్చకులు కట్లె లక్ష్మీనారాయణశర్మ లగ్నపత్రికను శాస్త్రోక్తంగా తయారు చేసి ఆలయ ఈఓకు సమర్పించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వారం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలలో భాగంగా మార్చి 7న కాల్వ గ్రామం నుంచి ఉత్సవమూర్తుల వరప్రయాణం, 8న రాత్రి జాగారణ, తెల్లవారు జామున 3.35 గంటలకు స్వాముల వారి కల్యాణోత్సవం, 9వ తేదీన స్వాముల వారికి నందివాహన, సింహవాహన సేవలు వుంటాయని తెలిపారు. 10వ తేదీన స్వాముల వారి రథోత్సవం, 11న ఉదయం వసంతోత్సం, సాయంత్రం పారువేట, 13న ఉత్సవ మూర్తులు తిరిగి కాల్వ గ్రామానికి బయలుదేరుతాయని వెల్లడించారు.

కొత్తూరులో వేలం పాటలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో టెంకాయలు, పూలు, ఫొటోలు తదితర దుకాణాలకు సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహించినట్లు ఈఓ రామకృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గాజుల అంగడిని వెంకటసుబ్బయ్య రూ. 68వేలకు దక్కించుకున్నాడన్నారు. అలాగే పూల దుకాణం రూ.4,11,000లకు బేతంచెర్లకు చెందిన సూర్యనారాయణ సొంతం చేసుకున్నాడని చెప్పారు. కాగా, టెంకాయల దుకాణం వేలంపాటను అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు తెలిపారు.

14న వసంత పంచమి వేడుకలు

ఓర్వకల్లు : మండలంలోని నన్నూరు సమీపంలో ఉన్న రాగమయూరి గ్రీన్‌హిల్స్‌లో వెలసిన విద్యా సుందర సరస్వతీ పీఠంలో ఈ నెల 14న వసంత పంచమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు మామిళ్లపల్లి యశోధర శర్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి అభిషేకం, అలంకారం, పిల్లలకు అక్షరభ్యాస కార్యక్రమం, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి ఆశిస్సులు పొందాలని కోరారు.


నేడు లొద్దిపల్లె సచివాలయ ప్రారంభోత్సవం

ఓర్వకల్లు : మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ మల్లీశ్వరి సోమవారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభిస్తారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఓర్వకల్లు పొదుపు భవన్ ప్రాంగణంలో ప్రభుత్వం విడుదల చేసిన 4వ విడత 'ఆసరా' పథకానికి సంబంధించిన లబ్ధిదారులకు చెక్కులను అందజేయనున్నట్లు తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 873 పొదుపు సంఘాలకు గత నాలుగేళ్లలో రూ.21 కోట్ల మేర ప్రభుత్వం బ్యాంకు రుణాలు రద్దు చేసినట్లు వెల్లడించారు. ఈ ఏడాది రూ.5.29 కోట్లు లను విడుదల చేసినట్లు తెలిపారు.

ఇన్‌పుట్ సబ్సిడీ వెంటనే ఇవ్వాలి

కల్లూరు: 2023 ఖరీఫ్ సీజన్‌లో కరువుతో నష్టపోయిన పంటలకు వెంటనే కరువు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కల్లూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి ఎ.కృష్ణ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులో జిల్లాలోని 25 మండలాల్లో 22 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కానీ కరువు నష్టపరిహారం రైతుల ఖాతాలో జయ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల నియమావళి అమలులోకి వస్తుందన్నారు. అనంతరం తహసీల్దార్ మునివేలుకు వినతి పత్రమిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కె.మధు, రైతులు ఈశ్వరయ్య, మద్దయ్య, పుల్లన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ



సి.బెళగల్‌లో ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు

సి.బెళగల్: స్థానిక భవిత కేంద్రంలో 11 మంది దివ్యాంగ పిల్లలకు సోమవారం ఫిజియోథెరపీ చేసినట్లు డాక్టర్ వీరేష్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన దివ్యాంగులకు బాల్, పాడ్స్ తదితర పరికరాలపై ముడుచుకుపోయిన కాళ్లకు, చేతులకు వ్యాయామం చేయించినట్లు చెప్పారు. ఇళ్ల వద్ద కూడా క్రమం తప్పకుండా వ్యాయామం చేయిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ప్రతి వారం జరిగే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రత్యేక అవసరాల గల చిన్నారులకు ఐఈఆర్‌టీలు మద్దిలేటి, సోమశేఖర్‌రెడ్డి బధిర బాలలకు పరికరాలతో విద్యను అందించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- కల్లూరు మండలంలో 8,621 మంది మహిళలకు వైఎస్సార్ ఆసరా
- పొదుపు మహిళలకు మెగా చెక్కు పంపిణీ
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం



పొదుపు మహిళలకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి





సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, హాజరైన మహిళలు

కల్లూరు: మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏపీఎం శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో కల్లూరు మండలం పొదుపు సంఘాల ఆసరా వారోత్సవాల కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఎమ్మెల్యే మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని, ఎంపీపీ బోయ శారద పొదుపు మహిళలతో కలసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలకు పాదయాత్రలో జగనన్న ఇచ్చిన మాట ప్రకారం 2019 ఏప్రిల్ 11 నాటికి ఉన్న బ్యాంక్ లింకేజీ అప్పు మొత్తాన్ని వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగు విడతల్లో రుణాలు మాఫీ చేశారన్నారు.

8,621 మంది సభ్యులకు లబ్ధి

ప్రభుత్వం ఆసరా పథకం కింద మండలంలో మొత్తం 831 పొదుపు సంఘాలు ఉంటే అందుల్లో 8,621 మంది సభ్యులకు లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే తెలిపారు. నాల్గవ విడత కింద రూ.4.94 కోట్లు రుణాలు మాఫీ చే శామన్నారు.నాలుగువిడతలో మొత్తం రూ19.76 కో ట్లు పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేసినట్లు వెల్లడి ంచారు. ఈ మేరకు నగదును నేరుగా లబ్ధిదారుల ఖా తాలోనే జమచేశామన్నారు. మీ కుంటుబాలు ఆర్థికంగా ఎదగి, జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన మేలు మరవకూడదన్నారు.

నాడు మోసం చేసిన టీడీపీ సర్కారు

2014 ఎన్నికల్లో పొదుపు సంఘాల రుణాలను మాఫీ చేస్తామని టీడీపీ హామీ ఇచ్చి.. అధికారంలోకి రాగానే హామీని చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. నమ్మి రుణాలు చెల్లించని పొదుపు సంఘాల ఆ తర్వాత తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. టీడీపీ పాలనకు, వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను గమనించాలని కోరారు. రాష్ట్రంలో అక్కాచెల్లెమ్మలపై సీఎం జగన్ అపారనమ్మకం ఉంచారన్నారు. రాబోయ్యే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణమూర్తి, తహసీల్దార్ మునివేలు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెద్ద ఈశ్వరయ్య, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పొదుపు సంఘాల సీసీలు, సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

కోలుకోలేక కోడుమూరు వాసి మృతి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి రైల్వేస్టేషన్ ఆవరణలో గత శుక్రవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన కోడుమూరు వాసి ఎర్రప రెడ్డి(43) కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. గుర్తుతెలియని వ్యక్తిగా వెల్దుర్తి పోలీసులు ఆసుపత్రికి తరలించగా, పత్రికల ద్వారా గుర్తించిన కుటుంబీకులు ఆసుపత్రికి చేరుకున్నారు. వెంకటగిరి స్వస్థలం కాగా కోడుమూరులో స్థిరపడ్డారు. మృతుడికి తల్లి, సోదరుడు ఉన్నారు. పలు కారణాలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం. మంగళవారం పోస్టుమార్టం అనంతరం విచారణ కొనసాగించనున్నట్లు వెల్దుర్తి పోలీసులు తెలిపారు.

నేడు గూడూరు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి గూడూరుకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి మంగళవారం భూమి పూజ నిర్వహిస్తున్నట్లు గూడూరు ఎంపీపీ సునీత సోమవారం తెలిపారు. ముఖ్య అతిథులుగా కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్ విచ్చేస్తున్నారని, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు హాజరుకావాలని ఎంపీపీ కోరారు.

ఆలయ మహాప్రాకారానికి రూ. 2 లక్షల విరాళం



రూ.2లక్షల చెక్కును ఈఓకు అందిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ మహాప్రాకార నిర్మాణానికి దాతలు రూ.2లక్షల విరాళం అందించినట్లు ఈఓ రామకృష్ణ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణం సాయిబాబా నగర్‌కు చెందిన సి.జమ్మన్న గారి ధర్మపత్ని రంగమ్మ కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులకు రూ.2లక్షల చెక్కును అందజేశారు. వారికి ఆలయ మర్యాదలతో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వాస్తవాలు తెలుసుకోకుండా విషపు రాతలు



నూతనంగా నిర్మించిన సీసీరోడ్డును చూపుతున్న గ్రామస్తులు

గడివేముల: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. గత నాలుగేళ్లలో మండలంలోని ప్రతి పల్లెలో అంతర్గత సీసీ రోడ్లు లేని వీధి లేదంటే అతిశయోక్తి కాదు. అయితే మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లపై ఓ పచ్చ పత్రిక సోమవారం ప్రచురించిన వార్తపై సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగుల కట్ట వద్ద వేసిన రోడ్డుకు పగుళ్లు ఎక్కడ ఉన్నాయో సదరు పత్రిక యాజమాన్యం చూపించాలన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకోకుండా ఎవరో అనామకులు పంపిన వాట్సప్ ఫోటోలతో విషపు రాతలు రాయడం దారుణమని ఖండించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే తమ గ్రామ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. ఎవరు ఎన్ని రకాలుగా విష ప్రచారం చేసినా తమ గ్రామ ప్రజలకు వాస్తవాలు తెలుసన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సహకారంతో గ్రామంలో పరుగులు పెడుతున్న అభివృద్ధిపై వాస్తవాలు రాయకపోయినా పర్వాలేదు గానీ, విష ప్రచారం మాత్రం చేయొద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రసాద్, కో ఆప్షన్ సభ్యుడు హుస్సేన్ బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు గోపాలయ్య,రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలపై సర్వ హక్కులు



మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ

సి.బెళగల్: ప్రభుత్వం అందజేసిన ఇళ్ల స్థలాలకు సర్వ హక్కులు కల్పించేందుకు రిజిస్ట్రేషన్లు చేసి ఇస్తున్నట్లు తహసీల్దార్ అనుపమ, ఎంపీడీఓ శకుంతల తెలిపారు. గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న ఉచిత రిజిస్ట్రేషన్లను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మండలంలోని 9 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న 16 జగనన్న కాలనీల్లో 1,622 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా ఇళ్ల స్థలాలను మంజూరు చేసిందని తెలిపారు. ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు ప్రస్తుతం గ్రామ సచివాలయాల్లో ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 657 మంది మాత్రమే స్థలాలను రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని, మిగిలిన లబ్ధిదారులు ముందుకు రావాలని కోరారు. గ్రామ వలంటీర్లు లబ్ధిదారులకు అవగాహన కల్పించి ముందుకు వచ్చేలా చూడాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు.

క్రీడాకారులకు సంపూర్ణ సహకారం

- బాస్కెట్ బాల్ అంతర్ పాఠశాలల పోటీల ప్రారంభ కార్యక్రమంలో శాప్ చైర్మన్



బాస్కెట్ బాల్ అంతర్ పాఠశాలల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

కర్నూలు (టౌన్) : రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడల్లో రాణించే క్రీడాకారులకు తమ వంతుగా సంపూర్ణ సహకారం అందిస్తామని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో బాస్కెట్ బాల్ అంతర్ పాఠశాలల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. రాణించేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. శాప్ చైర్మన్‌గా జిల్లాలో క్రీడారంగం అభివృద్ధికి కృషి చేశానని, కర్నూలులో బాస్కెట్‌బాల్ సింథటిక్ కోర్టు, ఆళ్లగడ్డ, బేతంచెర్ల, నందికొట్కూరు నియోజకవర్గాల్లో ఇండోర్ స్టేడియాల నిర్మాణానికి చర్యలు చేపట్టానన్నారు. ప్రతి విద్యార్థి, విద్యార్థినీ చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. బాలికల విభాగంలో 16 జట్లు, బాలుర విభాగంలో 16 జట్లు పోటీల్లో పాల్గొంటున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి భానుప్రకాష్ వెల్లడించారు. కార్యక్రమంలో 50వ వార్డు కార్పొరేటర్ షేక్ అహమ్మద్, సీఈఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

మందు బాబులకు జైలు శిక్ష

కర్నూలు : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 12 మంది మందుబాబులకు ఒక్కొక్కరికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నగర శివారులోని సుంకేసుల రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు ఆదివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. తెలంగాణలో మద్యం తాగి వాహనాలపై కర్నూలుకు వస్తున్న 16 మందిని అదుపులోకి తీసుకుని డ్రంకెన్ డ్రైవ్ టెస్టు నిర్వహించగా 12 మంది మోతాదుకు మించి మద్యం సేవించినట్లు బయటపడింది.వారిపై కేసు నమోదు చేసి సోమవా రం కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రెండు రోజులు జైలు శిక్షతో పాటు నలుగురికి ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. దీంతో వారిని పంచలింగాల శివారులోని జిల్లా జైలులో అప్పగించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ఆరోపణలు సరికాదు

కల్లూరు: పాణ్యం ఎమ్మెల్యే కాటసానిపై కల్లూరు అర్బన్ 30వ వార్డు కార్పొరేటర్ జయరాముడు, తండ్రి సంజన్న అసత్య ఆరోపణలు చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా ఈసీ మెంబర్ హేమలత, నాయకులు హరిప్రసన్న, రాజేష్, చంద్రశేఖర్, రత్నమయ్య మండిపడ్డారు. సోమవారం వారు కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్టీ మారాలనుకుంటే వెళ్లిపోవాలే తప్ప నిందలు వేయడం తగదన్నారు. కార్పొరేటర్ జయరాముడు, సంజన్నలపై కేసులు పెట్టించాల్సిన అవసరం ఎమ్మెల్యేకు లేదన్నారు. వార్డులో సీనియర్లను కాదని మీకు కార్పొరేటర్‌గా అవకాశం కల్పించి ప్రోత్సహించిన విషయాన్ని మరచిపోరాదన్నారు. సమావేశంలో వార్డు నాయకులు పాల్గొన్నారు.

పాణ్యంలో పట్టపగలే చోరీ

పాణ్యం: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో సోమవారం పట్టపగులే చోరీ జరిగింది. ఎస్సార్బీసీ కాల్వ వద్ద నివాసముంటున్న వసంతనాయుడు (విశ్రాంత ఆర్మీ) ఉదయం భార్యతో కలసి నంద్యాలలోని పంటి వైద్యశాలకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగటగొట్టి బీరువాలో ఉన్న రూ.4లక్షల నగదు, 5 తులాల బంగారు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు.

మున్సిపల్ కార్మికులకు క్షయ వ్యాధి పరీక్షలు



వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకున్న కార్మికులు

గూడూరు: స్థానిక మున్సిపల్ కార్మికులకు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసినట్లు గూడూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రత్యూష తెలిపారు. సోమవారం సేవా భారతి మొబైల్ వాహనం ద్వారా పరీక్షలు చేసినట్లు చెప్పారు. మంగళవారం గుడిపాడు గ్రామంలో పారిశుధ్య కార్మికులకు సేవలందిస్తామన్నారు. అవసరమైన వారికి మందులు అందజేస్తామని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీబీ యూనిట్ సూపర్‌వైజర్ నాగ మహేంద్ర, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవు



హాస్టల్‌ను పరిశీలిస్తున్న డీఎండబ్ల్యూఓ సునీల్‌కన్నా

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణకు సంబంధించి వసతి గృహ సంక్షేమాధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి డా.ఎ సునీల్‌కన్నా హెచ్చరించారు. సోమవారం ఉదయం ఆయన స్థానిక గణేష్‌నగర్‌లోని మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన హాస్టల్‌కు వెళ్లిన సమయంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే విద్యార్థులు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని, వెంటనే పరిసరాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. అలాగే నిర్ణీత సమయంలోగా విద్యార్థులకు ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులు కూడా వ్యక్తిగత శుభ్రత పాటించాలని, సమయానికి కళాశాలలకు వెళ్లి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

సమస్యలను పరిష్కరించండి



సి.బెళగల్: స్పందనలో సమస్యలను తెలుసుకుంటున్న అధికారులు

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ పనుపమకు వినతిపత్రాలు సమర్పించారు. కొత్తకోట, బురాన్‌దొడ్డి, సి.బెళగల్ గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. అదేవిధంగా పలు గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శకుంతల, ఈఓఆర్డీ సందీప్, ఎంఈఓలు జ్యోతి, ఆదామ్ బాషా, ఏఈఓ సిద్ధు, ఐసీడీఎస్ సి.బెళగల్ సెక్టార్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, హౌసింగ్ ఏఈ సుమంత్, ఇరిగేషన్ ఏఈ సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

గూడూరు: స్పందనలో వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ ఉదయ్‌సంతోష్ అన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్‌తో పాటు ఎంపీడీఓ కుమారి జయశ్రీ, పీఆర్ ఏఈ గోపాల్‌రావ్, సునీలమ్మ, తదితరులు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

స్పందన దరఖాస్తులపై దృష్టి సారించండి

పాణ్యం : స్పందన కార్యక్రమంపై అధికారులు దృష్టి సారించాలని తహసీల్దార్ ఫణికుమార్ అన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన స్పందనకార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులపై సమీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల వారీగా వచ్చే దరఖాస్తులపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించని సమస్యలు పరిష్కరించాలన్నారు.

15లోగా పంట నమోదు చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: రబీ సీజన్‌లో పంటలను సాగు చేసిన రైతులంతా ఈనెల 15వ తేదీలోగా పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని కోడుమూరు ఏఓ రవిప్రకాష్ అన్నారు. సోమవారం కోడుమూరు వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహామండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. పంట నమోదు, ఈకేవైసీ ఉంటేనే రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, మందులు, విత్తనాలు ప్రతి రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువైద్యాధికారి రామసుబ్బారెడ్డి పాడి రైతులంతా పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించడంతో పాటు, పశు బీమా చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో సలహామండలి అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ఏఈఓ తస్లీమ్, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

- అభివృద్ధి పథంలో మార్కెట్ కమిటీ
- పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని, హఫీజ్‌ఖాన్
- యార్డులో మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని, హఫీజ్‌ఖాన్, మాజీ చైర్మన్ శమంతకమణి

కర్నూలు(అగ్రికల్చర్): రైతుల సంక్షేమం లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. మార్కెట్ కమిటీ పాలక వర్గం తీసుకుంటున్న చర్యలతో మార్కెట్ కమిటీ అభివృద్ధి పథంలో నడుస్తుందని, మార్కెట్ కమిటీకి ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందని స్పష్టం చేశారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ శమంతకమణి స్వంత ఖర్చులతో నిర్మించిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఆమెతో కలిసి ఎమ్మెల్యేలు ప్రారంభించారు. కార్యక్రమంలో శమంతకమణి కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు. అనంతరం పాణ్యం ఎమ్మెల్యే మార్కెట్ యార్డులో మూడు చలి వేంద్రాలను కూడా ప్రారంభించారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి చాంబరులో 2024–25 సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించారు. 2023–24లో మార్కెట్ కమిటీకి గణనీయంగా ఆదాయం పెరిగినందుకు ఎమ్మెల్యే కాటసాని హర్షం వ్యక్తం చేశారు. 2022–23లో ఏప్రిల్ నుంచి జనవరి వరకు రూ.4కోట్లు ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. 2023–24లో ఏప్రిల్ నుంచి జనవరి వరకు 5.40 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. 2024–25లో రూ. 6.70 కోట్ల ఆదాయం సాధించాలనే లక్ష్యంతో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపుతున్నామని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... మార్కెట్ యార్డు అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు, వైస్ చైర్మన్ బీమేశ్వరరెడ్డి, ఇతర పాలకవర్గం సభ్యులు, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

16న బంద్‌ను విజయవంతం చేయండి



ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్నాథం

కోడుమూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16వ తేదీ తలపెట్టిన గ్రామీణ బంద్ పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్నాథం పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ప్రజాసంఘాల నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులు, కార్మిక చట్టాలను నీరుగారుస్తోందని దుయ్యబట్టారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప, సీపీఎం మండల కార్యదర్శి గఫూర్, ప్రజా సంఘాల నాయకులు భాస్కర్, నాగరాజు, రాముడు, రాజు తదితరులు పాల్గొన్నారు.